


# రైతులను ఏడిపిస్తున్న యూరియా!

## రాజకీయం చేస్తున్న అధికార, ప్రతిపక్షాల నేతలు

- సాగు పనులు వదిలి.. యూరియా కోసం కదిలి
- తెల్లవారక ముందే బారులు తీరి నిరీక్షణ
- రోడ్డెక్కి ధర్నాలు, నిరసనల బాట
- కొరత లేదంటున్న అధికారులు
- పంపిణీపై క్షేత్రస్థాయి పరిశీలన కరువు
- రైతుల నిరసనలతో రాజకీయ లబ్ధికి పాకులాట





యూరియా కొరత రైతన్నకు చుక్కలు చూపిస్తున్నది. సాగు పనులు మానుకొని పొద్దస్తమానం ఎరువుల కోసం పడిగాపులు కాసినా యూరియా బస్తాలు దొరకడం గగనం అవుతుందని రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో యూరియా కోసం రైతులు క్యూ లైన్లలో నిలబడి వేచి చూస్తున్నారు. ఎకరాకు ఒక బస్తా చొప్పున పంపిణీ జరుగుతుండడంతో ఇంటిల్లిపాది పనులు మానుకొని యూరియా కోసం పడిగాపులు పడుతున్నారు. అధికార యంత్రాంగం మాత్రం యూరియా కొరత లేదని చెబుతున్నా ప్రత్యక్షంగా రైతులు అనుభవిస్తున్న సొసైటీ, ఫర్టిలైజర్ దుకాణాలకు యూరియా సరఫరా చేయడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగుతున్నారు. అటు సాగు పనులు సాగక, ఇటు యూరియా దొరకక అన్నదాతలు ఇబ్బంది పడుతుంటే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శలు చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారని విమర్శిస్తున్నారు.

(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్) గత వారం రోజుల నుంచి యూరియా కోసం పడిగాపులు కాసినా అన్నదాతల కష్టాలు తీరడం లేదు. కేవలం ఒక లారీ యూరియాను పంపడంతో ఏమూలకు సరిపోతుందని రైతులు మండిపడుతున్నారు. నాట్ల వేళ పనులు మానుకొని, పస్తులు ఉంటూ యూరియా కోసం వానకు సైతం లెక్కచేయక క్యూలైన్లలో వేచి ఉన్నా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు చేతగాని తనం వల్లే యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆరోపించారు. కేసీఆర్ హయంలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత ఉండేదికాదని పేర్కొన్నారు. మునుపెన్నడూ లేని విధంగా రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను అరిగోస పెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే వచ్చిన యూరియాను ఎలాగైనా పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసుల పహారా మధ్య పంపిణీ చేస్తున్నారు.

### మెదక్ జిల్లాలో మరీ అధ్వాన్నం...

మెదక్ జిల్లాలో యూరియా సమస్య దారుణంగా ఉంది. ఓవైపు జిల్లా కలెక్టర్ జిల్లాకు సరిపడా యూరియా ఉందని చెబుతుంటే పంపిణీ ఎందుకు జరగడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెబుతున్నా జిల్లాలో ఆయా మండలాల్లో రైతులకు అందడం లేదు. మరో 1500 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, అలాగే సెప్టెంబర్ మాసానికి 4000 మెట్రిక్ టన్నులు తెప్పిస్తామని అధికారులు చెబుతున్నా రైతులు మాత్రం రొడ్డెక్కి నిరసనలు తెలిపే పరిస్థితులు మాత్రం మారడం లేదు. ఆదివారం కూడా చేగుంట, శివంపేట తదితర మండలాల్లో రైతులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### అధికారుల నోట నానో యూరియా...

రైతులు రసాయన ఎరువులకు బదులు నానో యూరియాను వాడాలని అధికారులంతా చెబుతున్నా రైతులకు సరియైన అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. వానాకాలం సాగు పనులు ప్రారంభం కాకముందే నానో యూరియాపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తీరా సాగు పనులు ప్రారంభమై యూరియా అవసరం వచ్చినప్పుడు నానో యూరియాపై ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీంతో రైతులు యూరియా బస్తాల కోసం ఎగబాకుతున్నారు. యూరియా కొరత లేదంటూనే రైతులకు పంపిణీ మాత్రం జరగడం లేదు.

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువు...

జిల్లాలో యూరియా పంపిణీపై సంబంధిత అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ కరువైందనే ఆరోపణలు ఉన్నాయి. రైతుల అవసరానికి తగ్గట్టుగా ఆయా సొసైటీలు, ఎరువుల దుకాణాలకు సక్రమంగా సరఫరా చేస్తే ఈ సమస్య వచ్చేది కాదు. నిజంగానే యూరియా కొరత ఉందా అంటే అధికారులు ఒప్పుకోవడం లేదు. వ్యాపారులు ఏమైనా కొరత సృష్టించే ప్రయత్నం చేస్తున్నారా అనే విషయంలో స్పష్టత లేదు. ఉన్నతాధికారులు కార్యాలయాలకే పరిమితమై రైతులు రోడ్డెక్కేలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### రాజకీయ లబ్ధిలో నాయకులు...

మెదక్, సిద్దిపేట జిల్లాలో యూరియా సమస్య తీవ్రంగా ఉండడంతో ఈ అవకాశాన్ని ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తుండగా అధికార పార్టీ నాయకులు సైతం ప్రతి విమర్శలు చేయడమే తప్ప రైతుల ఇబ్బందులను పరిష్కరించే మార్గాలను అన్వేషించడం లేదు. రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే వారికి మద్దతు పేర రాజకీయం చేయడం కొందరి వంతైతే ప్రెస్‌మీట్లు పెట్టి ప్రతిపక్షాలను దూషించడం అధికార పార్టీ నాయకులు ముందుంటున్నారు. రైతులకు యూరియా కూడా సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్, కేంద్రం సరఫరా చేయడం లేదంటూ కాంగ్రెస్, రాష్ట్రంలో యూరియా కొరతకు కాంగ్రెస్ కారణమని బీజేపీ ఇలా ఎవరికి వారు విమర్శలు చేసుకుంటున్నా నష్టపోతున్న మాత్రం అన్నదాతే. ఏదిఏమైనా రైతుల బాధలను మాత్రం రాజకీయ నాయకులు పట్టించుకోకుండా వారి స్వార్ధ రాజకీయాలకు యూరియా సమస్యను వినియోగించుకుంటున్నారని రైతులు విమర్శిస్తున్నారు.